క్లుప్తంగా

రెవెన్యూ అధికారుల విచారణ



విచారణ చేపడుతున్న రెవెన్యూ అధికారులు

హిరమండలం: మండలంలోని గులుమూరు పంచాయతీ చాపరాయిగూడలో నిర్మిస్తున్న రవిచంద్ర ఆశ్రమంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఆశ్రమం ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టినట్లు వివాదం రావడంతో ఆర్ఐ ఉమాశంకర్, వీఆర్వో శంకర్‌రావు క్షేత్రస్థాయిలో గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఆశ్రమం నిర్వహిస్తున్న స్థలంలో గతంలో తమకు ప్రభుత్వం డీపట్టా ఇచ్చిందని తెలిపారు.

విద్యార్థులతో మమేకం కావాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకం కావాలని ఎంఈవో రాంబాబు సూచించారు. శుక్రవారం ఎమ్మార్సీలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష పే చర్చ పేరిట విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వెనుకబడిన విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులకు కీలక సూచనలు చేయాలన్నారు. సమావేశంలో ఎంఈవో-2 గొల్లవాడు, హెచ్‌ఎం కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు



ప్రైవేటు బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: గంజాయి అక్రమ రవాణాపై ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని డాగ్ స్క్వాడ్‌తో శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీ బ్యాగులతో పాటు కొన్ని రైళ్లలో కూడా పోలీసుల తనిఖీలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని కొన్ని ప్రాంతాలతో పాటు సీఎస్పీ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సులు, వివిధ వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. పాతపట్నం, కొత్తూరు, బత్తిలి వంటి ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి విజయవాడ హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను రహదారిపై ఆపి సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంప్లెక్స్ లీజు రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలో నివగాం గ్రామంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ లీజును రద్దు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావుతో పాటు గ్రామానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రవిచంద్రకు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం 1995లో నిర్మించిన కాంప్లెక్స్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అలాంటి తరుణంలో ఆర్టీసీ అధికారులు విచక్షణ రహితంగా కాంప్లెక్స్‌ను లీజుకు ఇవ్వడం దారుణమన్నారు. లీజ్ రద్దు చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యుడు అలివెల్లి రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్, బి.చిన్నారావు, సత్యాలు, రాజు, అప్పలరాజు, అక్కులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండగా 'వారధి'



పేద విద్యార్థులకు న్యూట్రీషన్ ఫుడ్ అందజేస్తున్న ప్రతినిధులు

నరసన్నపేట: ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్న తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరూ లేని అనాథ పిల్లలను ఆదుకునేందుకు స్థానిక ఎస్‌వీ సీటీ, పడాల చారిటబుల్ ట్రస్టులు సంయుక్తంగా వారధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి సాయి కుమారి వివరించారు. ఎంపిక చేసిన 30 మంది విద్యార్థులకు శుక్రవారం న్యూట్రిషన్, ఐరెన్ ఫుడ్ పంపిణీ చేశారు. ఇప్పటికే వీరి చదువుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కమల్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం..!

- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- కదంతొక్కిన ప్రజలు, కార్యకర్తలు
- ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్



నరసన్నపేట: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచడంపై వైఎస్సార్‌సీపీ హయాంలో నరసన్నపేటలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. కూటమి కుట్రలపై ప్రజాగ్రహం పెల్లుబికింది. రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్లు భారం మోపడం దారుణమని, ఈ పెంపును తక్షణమే విరమించుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. ఇంత పెద్ద మొత్తంలో చార్జీలు పెంచడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సంపద సృష్టి పేరుతో ఈవిధంగా చార్జీలు పెంచడం శోచనీయమన్నారు.

కార్యక్రమంలో నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ బాబ్జీ, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, బగ్గు రామకృష్ణ, ఎం.శ్యామ్, నక్క తులసీదాస్, వరుదు వంశీ కృష్ణ, గెల్లంకి వెంకటరావు, గునుపూర్ రామారావు, కణిత కృష్ణారావు, బార్ల వేణుగోపాలరావు, రాజాపు అప్పన్న, లుకలాపు రవి, పోలాకి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల పెంపు భారమే



ఇప్పటికే విద్యుత్ బిల్లులపై వాడుకున్న యూనిట్ చార్జీల కంటే సర్ చార్జీలు, ఇతర చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం, అదీ రెండేళ్లు ఉంటాయడం దారుణం. ప్రతీ బిల్లుపై కనీసం రూ.200 వరకూ భారం ఉంటుంది. ఇది మాలాంటి చిన్న కుటుంబాలపై పెను ప్రభావం చూపుతుంది. చార్జీల పెంపును ప్రభుత్వం విరమించుకోవాలి.

– అల్లు రామయ్య,
దూకులపాడు,నరసన్నపేట మండలం

విరమించుకోవాలి

ఇచ్చినమాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడం శోచనీయం. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే విరమించుకోవాలి. ఇదే కొనసాగితే ప్రతీ కుటుంబంపై భారం పడుతుంది. అలాగే ఇతర రంగాలపై కూడా దాని ప్రభావం ఉంటుంది. మాలాంటి కుటుంబాలకు నెలకు రూ.300 వరకూ భారం ఉంటోంది. ప్రభుత్వం పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

– బోర సింహాచలం,రావిపాడు,
జలుమూరు మండలం

చార్జీలను తక్షణమే తగ్గించాలి

పాతపట్నం: కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ బిల్లులను తక్షణమే తగ్గించాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు. పాతపట్నంలో కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాటు పేరుతో నిరసన ర్యాలీ శుక్రవారం చేపట్టారు. ముందుగా పంచాయతీ కార్యాలయం వద్ద బస్టాండ్ నుంచి మార్కెట్ మీదుగా ఆల్‌ఆంధ్ర రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకుని విద్యుత్ ఏఈ జి.రవీంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ రాష్ట్రంలోని గృహ వినియోగదారులు కరెంటు చార్జీల భారం మోయలేకపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు భారీగా పెంచడంతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక బిల్లులు తగ్గిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు విపరీతంగా పెంచడం దారుణమన్నారు. అలాగే తక్షణమే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత కరెంటును పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యలక్ష్మి, ఎంపీపీ సవర సావిత్రి, పీఏసీఎస్‌లు ఉర్లాన బాలరాజు, ఏవీ సురేష్, చింతాడ సూర్యనారాయణ, కొల్ల కృష్ణ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కొండాల అర్జునుడు, మద్దు తాతయ్య, పార్టీ మండల అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, మీసాల రామకృష్ణ, పెనుమజ్జి విష్ణుమూర్తి, ముగడ జనార్దనరావు, శిమ్మ సాంబశివరావు, లోచర్ల మల్లేశ్వరరావు, కండివలస ఆనంద్, ఏనుగుతల సూర్యం, కలమట రమేష్, తమ్మినాయుడు, ఈగల చిన్నారావు, కొల్ల లక్ష్మనాయుడు, నూలు ఈశ్వరరావు, పోలాకి రేణుక, అంపురం రాజ్యలక్ష్మి, కె.జానకమ్మ, తూలుగు ప్రవీణ్, మురళీ, టంకాల సుధాకర్, శశిభూషణరావు, జయమునిరావు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: మార్కెట్ మీదుగా నిరసన ర్యాలీ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

ఆమదాలవలస: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు



బిల్లులు ఉపసంహరించుకోవాలి

ఆమదాలవలస: ప్రజలపై మోపిన విద్యుత్ బిల్లుల భారాన్ని ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం ఆమదాలవలస పట్టణంలో కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. తొలుత వన్ వే ట్రాఫిక్ రోడ్ వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా పార్టీ శ్రేణులతో పెద్ద ఎత్తున ర్యాలీ చేస్తూ నిరసనలు చేసి నినాదాలు చేశారు. అనంతరం లక్ష్మీనగర్ వీధిలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకొని ఏఈ రామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ జెడ్పీటీసీలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, బెజ్జిపురపు రామారావు, ఆమదాలవలస పట్టణం, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండల పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, తమ్మినేని శ్రీరామమూర్తి, బెవర మల్లేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, పప్పల రమేష్, వైఎస్సార్‌సీపీ కాళింగ సామాజిక వర్గ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ నాయకురాలు బొడ్డేపల్లి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పోడుపంటలే ఆధారం..!



సూదిరాయిగూడ ప్రాంతంలో ఆశాజనకంగా ఉన్న కంది పంట

- ఏడాది పొడవునా సాగు
- ఆర్థికంగా ఆధారం పొందుతున్న గిరిజనులు
- 16 వేల ఎకరాల్లో సాగు

ఎల్.ఎన్.పేట: కొండనే నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులకు పోడు పంటలు ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ఉదయం ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం వరకు కొండపోడు వ్యవసాయం చేసుకుంటూ ఏడాది పొడవునా దిగుబడి పొందుతున్నారు. ఆయా సీజన్లలో లభించే పంటలతో పాటు సీజన్‌తో పని లేకుండా పంటలను పండిస్తుంటారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే పంటకు పెట్టుబడి ఎక్కువగా అవసరం ఉండదని మండలంలోని మురగడలోవ, సూదిరాయి గూడ, కొత్త జోగివలస తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు చెబుతున్నారు. వాణిజ్య పంటల్లో ప్రధానమైనది పసుపు సాగు ఎక్కువగా ఆదుకుంటుందని అంటున్నారు. పసుపు పంటలో రకరకాల అంతర పంటలుగా చీమ మిరప, బొప్పాయి, అరటి వంటి పంటలు వేసుకుంటారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఎల్.ఎన్.పేట, కొత్తూరు, మెళియాపుట్టి, హిరమండలం, పాతపట్నం ఐదు మండలాల్లోనూ గిరిజనులే ఎక్కువగా ఉన్నాయి. వీరు సుమారు 16 వేల ఎకరాల్లో పోడు పంటలు పండిస్తున్నారు. వీరు పండించిన పంట దిగుబడులు ఆయా మండల కేంద్రాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్దకు విక్రయానికి తీసుకువస్తారు. గిరిజనులు పండించిన పంట దిగుబడులకు ధర నిర్ణయించి గిరిజనులే విక్రయించుకుంటారు. కొన్ని సందర్భాల్లో దళారుల బెడద ఉంటుందని, అయినప్పటికీ ధర గిట్టుబాటుగా లేకుంటే విక్రయించమన్నారు. పండ్ల రకాల విక్రయం తప్పదని గిరిజనులు చెపుతున్నారు.

మార్కెట్ సదుపాయం లేదు



కొండపోడు పంటగా పండించిన రకరకాల పంటలను అమ్మాలంటే మార్కెట్ సదుపాయం లేదు. కొండ మీద నుంచి కిందకు దించిన తర్వాత వాటిని రోడ్డు పక్కన ఉంచి అమ్ముకోవాల్సి వస్తోంది. సీజన్‌తో పాటు ఏడాది పొడవునా పోడులో ఏదో ఒక పంట పండుతూనే ఉంటుంది. అందువలన పంటలు అమ్మేందుకు మార్కెట్ సదుపాయం కల్పించాలి.

– సవర చిరంజీవి, గిరిజన రైతు,
మురగడలోవ, ఎల్.ఎన్.పేట

మన్మోహన్ సింగ్‌కు నివాళి



నరసన్నపేట: మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తదితరులు

దేశానికి పదేళ్లు ప్రధానిగా పనిచేసి ఉన్నత విలువలు, లక్ష్యాలతో ముందుకు వెళ్తూ మచ్చలేని నాయకుడిగా దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గుర్తింపు పొందారని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఆయన మృతికి నివాళులర్పించారు. ఆర్థిక చాణుక్యుడిగా దేశం కోసం అనేక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. అటువంటి వ్యక్తిని కోల్పోవడం దేశానికి తీరనిలోటు అని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: భగీరథపురం పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



పాతపట్నం: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న కోటేశ్వరరావు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం దేవరశెట్టి వీధిలో ఉన్న సత్యసాయి మందిరం నిర్మాణానికి ఎస్ఆర్ఐ అంధవరపు కోటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. మందిరం కన్వీనర్ వెంకటరమణకు రూ.లక్ష చెక్కును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బెహర సురేష్, సింహాద్రి కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిమ్మెంట్ రోడ్లు, డ్రైనేజీలతో పాటు గోశాలలు, ఇంకుడు గుంతల పనులు జరుగుతున్నాయన్నారు. ఆయా పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పనులు పూర్తి చేసిన వారం రోజుల్లో బిల్లులు చెల్లించడం జరుగుందన్నారు. బిల్లులు కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వెండర్స్‌కు అవగాహన కలిగించాలని అన్నారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోరు బాగు చేయరూ..!



సారవకోట మండలంలోని చిన్నగుజ్జువాడ పంచాయతీ ముంజువానిపేట గ్రామంలో తాగునీటి బోరు పాడైపోవడంతో హెడ్ తొలగించారు. కాగా నెలలు గడుస్తున్నా బోరు బాగు చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

- సారవకోట

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు



మత్తు పదార్థాలు నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు పొందూరులో శుక్రవారం డాగ్‌స్క్వాడ్‌తో మత్తు పదార్థాల సెర్చింగ్ నిర్వహించారు. బస్టాండ్, మార్కెట్‌లోని షాపులు, రైల్వేస్టేషన్ సమీపంలోని షాపులు, రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- పొందూరు

తగ్గని వర్షపు నీరు



వర్షాలు తగ్గినప్పటికీ పంట పొలాల్లో వర్షపు నీరు తగ్గలేదు. ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట, దబ్బుపాడు, సిద్ధాంతం, కృష్ణాపురం, బరటాం, చిట్టిమండలం, ధనుకువాడ, వాడవలస, కోవిలాం, రావచంద్రి తంపర ప్రాంతాల్లో ఉన్న అపరాల పంట పొలాల్లో వరదనీరు నిలిచి ఉంది. వారం రోజులుగా అపరాల పంట పొలాల్లో నీరు నిలిచి ఉండడంతో పంటకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి అందివచ్చే పంటను కోల్పోతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు.

- ఎల్.ఎన్.పేట

విద్యుత్ అక్రమ వినియోగంపై కేసు నమోదు

హిరమండలం: మండలంలోని గులుమూరు పంచాయతీ చాపరాయిగూడలో రవిచంద్ర ఆశ్రమానికి అక్రమంగా విద్యుత్ వినియోగంపై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. ఇక్కడ గత కొద్దిరోజులుగా ఆశ్రమ నిర్వహణకు సంబంధించి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అక్రమంగా విద్యుత్ వాడుతుండడంపై వచ్చిన సమాచారం మేరకు శ్రీకాకుళం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో విద్యుత్ మీటరు లేకుండా మెయిన్ లైన్ నుంచి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండడాన్ని గుర్తించారు.

ఆశ్రమ నిర్వాహకుడి రవిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఏఈ కృష్ణరావు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. ఆశ్రమ నిర్వాహకుడిపై అపరాధ రుసుం విధించే అవకాశం ఉంది.